క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామడుగు: జిల్లా కేంద్రంలో 6న నిర్వహించే రెడ్ల ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను సోమవారం మండలంలోని రాంచంద్రాపూర్‌లో రెడ్డి సంఘాల ఐక్య వేదిక నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సమ్మేళనం కార్యక్రమానికి ప్రతి రెడ్డి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

దోస్త్ అడ్మిషన్లపై అవగాహన సదస్సు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం దోస్త్ అడ్మిషన్లపై ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ హనుమకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడ్మిషన్ ప్రక్రియలో ఉండే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసులు పంపిణీ

సైదాపూర్: హుజూరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత సోమవారం మండలంలోని దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని, పేదలు, వికలాంగులకు ప్రయాణంలో రాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ప్రాణాలకు భద్రత, బీమా సౌకర్యం కూడా కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, వెంకటస్వామి, విద్యాన్‌రెడ్డి, హరీశ్, ఆంజనేయులు ఉన్నారు.

'కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న రామారావు

ఇల్లందకుంట: రైతు దినోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఓ రైతుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఇల్లందకుంట మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇంగిలే రామారావు తీవ్రంగా ఖండించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేస్తామన్నా హామీ ఏమైందని ప్రశ్నించారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.పదివేలు ఎప్పుడు ఇస్తారని రైతులు నిలదీస్తే ఇష్టారీతిగా మాట్లాడి రైతులను అవమానించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రైతులకు క్షమాపణ చెప్పాలని లేదంటే నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డిని తిరగకుండా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకార జిల్లా అధ్యక్షుడు బండి మల్లేష్, గొడిశాల పరమేష్, శనిగరపు రాము, ఐలయ్య, ఎన్ఎస్‌యూఐ నాయకులు గుండారపు సాయికుమార్, పెద్ది అభి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తిరోగమనంలో తెలంగాణ అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

గంగాధర: కేసీఆర్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలో పయనిస్తుందని భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు తెలిపారు. గంగాధరలో సోమవారం మాట్లాడుతూ...బీజేపీ మహా జనసంపర్క్ అభియాన్, మోదీ పాలన తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 12న కేంద్ర మంత్రి ప్రకాష్‌జవదేకర్ చొప్పదండి నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల విస్తృత ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. రూ.ఐదులక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. 24 గంటల విద్యుత్తు అందిస్తున్న ఘనత పీఎం నరేంద్ర మోదీ ప్రభుత్వానిదేనని, రూ.యాభైవేల కోట్లు బాకీపడ్డది కేసీఆర్ సర్కార్ అని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు శ్రావణ్‌కుమార్, బాల్‌రెడ్డి, రామానుజం, చంద్రశేఖర్, దూలం కళ్యాణ్, గుడి రవీందర్, నెరెళ్ల శ్రావణ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ముక్కెర రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని సోమవారం హెచ్‌సీఎల్ సీనియర్ డైరెక్టర్ సబ్బని వెంకట్ సోమవారం పరామర్శించారు. ఈ మృతికి గల కారణాలను తెలుసుకున్న అనంతరం ఆర్థికసాయం అందజేశారు. వెంట శ్రీనివాస్, ఆకునూరి అర్జున్, నరెడ్ల వినోద్ తదితరులు ఉన్నారు.

అన్నిసేవలున్నా.. వినియోగమేది?

- మహిళల ఆరోగ్యం దృష్ట్యా నార్మల్ డెలివరీలకు ప్రభుత్వం కృషి
- ఏమవుతుందోననే భయంతో సిజేరియన్‌కు మొగ్గు
- ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు
- వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో గర్భిణులకు సరైన వైద్యసేవలు అందుతున్నా ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. మండలంలో 17 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిలో ఇప్పటివరకు నమోదైన వారి గర్భిణుల సంఖ్య 187 మంది ఉన్నారు. గడిచిన మూడునెలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏ ఒక్క గర్భిణికి ప్రసవం చేయలేదు. హుజూరాబాద్, కరీంనగర్‌లోని మాతా శిశు సంరక్షణ కేంద్రాలకు తక్కువ మంది వెళ్తున్నారు. మూడునెలల్లో 76 మందికి మాత్రమే కేసీఆర్ కిట్ అందించారు. మిగతా వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటున్నారు.

102 ద్వారా సత్వర సేవలు

గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణుల కోసం ప్రభుత్వం 102 వాహనాన్ని ప్రవేశపెట్టింది. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయిన బాలింతలను ఇంటికి చేర్చేందుకు 102 వాహనానికి ఫోన్ చేస్తే క్షేమంగా ఇంటికి చేరుస్తోంది. కాగా చాలామంది ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరి వేలకు వేలు ఖర్చుచేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.



మూడు నెలల్లో 41 మందికి ప్రసవాలు

మండలంలోని 17 గ్రామాల్లో 187 మంది గర్భిణులు పేర్లను నమోదు చేసుకొని ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకోగా మూడు నెలల్లో ప్రభుత్వ ఆస్పత్రిలో 41 మందికి మాత్రమే ప్రసవాలు జరిగాయి. మరో 35 మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో డెలివరీ అయినట్లు రికార్డులున్నాయి. కేసీఆర్ కిట్‌ను ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయిన 41 మంది మాత్రమే లబ్ధిపొందారు. సీఎం కేసీఆర్ ఇచ్చే కిట్ మొదటి, రెండో కాన్పు వరకు పొందే అవకాశం ఉన్నా కొందరు వేలకు వేలు వెచ్చించి ప్రసవాలు చేయించుకుంటున్నారు.

మూడు విడతలుగా డబ్బులు అందజేత

పేద, మధ్య తరగతికి చెందిన మహిళలతో పాటు ప్రతి మహిళకు సీఎం కేసీఆర్ కిట్‌తో పాటు నగదును ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్నారు. ఆడపిల్లకు రూ.13వేలు, మగశిశువు జన్మిస్తే రూ.12వేలు అందిస్తున్నారు. వీటిని మూడు విడతలుగా ఇస్తున్నారు. మొదటగా మూడు వేలు, రెండో విడతలో రూ.5వేలు, మూడో విడతలో మిగిలిన డబ్బులను వారి బ్యాంకు ఖాతాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జమ చేస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెలివరీ అయిన మహిళలు మూడో విడత డబ్బులను, కేసీఆర్ కిట్‌ను అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిగా డెలివరీలు చేయరని, తల్లి ప్రాణంతో పాటు తల్లికి ఏమైనా జరిగితే ఎవరూ బాధ్యులని అప్పు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.

అవగాహన కల్పించాలి

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది మూడునెలలు దాటిన ప్రతి గర్భిణికి అవగాహన కల్పించాలి. నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యసేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలి. డెలివరీ సమయంలో గర్భిణులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సలహాలు, సూచనలు చేస్తే ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లకుండా ఉంటారు. ప్రతిగ్రామంలో అవగాహన సమావేశాలు నిర్వహించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు



మండలంలోని అన్ని గ్రామాల్లో మూడునెలలు దాటిన గర్భిణులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. మండలకేంద్రం, కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్యం కేంద్రంలో డెలివరీ చేసుకోవాలి. సీఎం కేసీఆర్ కిట్, నగదును సద్వినియోగం చేసుకోవాలి.

– ధర్మనాయక్, మెడికల్ ఆఫీసర్, చిగురుమామిడి పీహెచ్‌సీ

వారంలో రెండుసార్లు భోజనం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమ, శుక్రవారాల్లో వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 1993–94 పదో తరగతి విద్యార్థినులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

చెరువుల పండుగ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

శంకరపట్నం: చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీవో బషీరొద్దీన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చెరువుల పండుగపై పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్ఎస్పీ అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 8న రైతులు, మత్స్యకారులతో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డీఈ కవిత, ఏఈ మొగిళి పాల్గొన్నారు.

ఇల్లందకుంట: చెరువుల పండుగ కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని తహసీల్దార్ మాధవి అన్నారు. కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మాట్లాడారు.

ఆధ్యాత్మికం

మల్లాపూర్‌లో పెద్దమ్మతల్లి బోనాలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో సోమవారం పెద్దమ్మతల్లి బోనాల కార్యక్రమంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ కులస్తులు, టీఎల్ యువసేన అధ్యక్షుడు తూడి లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమి కౌలుకు వేలం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి సాగుభూమి కౌలుకు 8న వేలం వేయనున్నట్లు చైర్మన్ మల్హరావు తెలిపారు. కొత్తగట్టు గ్రామంలో దేవాలయంకు చెందిన సర్వే నంబర్ 407లో 38 గుంటల సాగుభూమి కోసం వేలంలో పాల్గొనే రైతులు రూ.పదివేల దరావత్తు చెల్లించాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు విరాళం

వీణవంక: మండలంలోని లస్మక్కపల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి,బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రూ. లక్ష విరాళం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గ్రామం అభివృద్ధి చేస్తానని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులుసాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, భానుచందర్, రఘుపాల్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: మండలంలోని వావిలాలలో గ్రామ దేవతలు భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పుల్లూరి స్వప్నసదానందం రూ.పదివేల విరాళం సోమవారం అందజేశారు. 12 నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో నిరంతర వెలుగులు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్
- విద్యుత్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించాం
- మానకొండూర్ ఎమ్మెల్యే బాలకిషన్



గంగాధర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్



తిమ్మాపూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకిషన్

గంగాధర: స్వరాష్ట్రంలో నిరంతర వెలుగులతో రెప్పపాటు విద్యుత్ పోని రాష్ట్రంగా తెలంగాణ దేశానికి ఆదర్శంగా మారిందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వీఎఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం తెలంగాణ విద్యుత్ విజయోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చర్యలతో నిరంతరం విద్యుత్ సరఫరా సాధ్యమైందన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, నియోజకవర్గంలో పలు మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: రాష్ట్రం విద్యుత్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధించిందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధి అల్గునూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ విద్యుత్ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రసమయి హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ కోసం పోరాటాలు చేశామని, పొలాలకు నీరందని పరిస్థితి ఉండేదని అన్నారు. కరెంటు సరిగా లేక మోటార్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవని అడ్డగోలుగా ప్రజల నుంచి గత ప్రభుత్వాలు బిల్లులు దోచాయన్నారు. కరెంట్ కోసం ధర్నాలు చేసిన సంఘటనలు గుర్తున్నాయని, బిల్లులు కట్టలేక ఆత్మహత్య చేసుకుంటామని ప్రభుత్వాలను హెచ్చరించిన రోజులు కూడా ఉన్నాయని, నాటి ప్రభుత్వ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సీఎం కేసీఆర్ అప్పుడే రాజీనామా చేశారని పేర్కొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ఆయనతో కలిసి ఎన్నో పోరాటాలు చేశానని, తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదటి పాట విద్యుత్‌పై ఎలుగెత్తి పాడానని, చనిపోయిన రైతులపై ప్రభుత్వం నక్సలైట్ల ముద్ర వేసిందని గుర్తు చేశారు. మన వనరులు, విద్యుత్ కేంద్రాలను దోచుకుని మనకు ఉమ్మడి పాలకులు చీకటి మిగిల్చారని పేర్కొన్నారు. ఆ వనరులనే ఉపయోగించుకొని నేడు 24 గంటలు విద్యుత్ ఇస్తున్నది సీఎం కేసీఆర్ అని వివరించారు. నాడు ఎవరైనా చనిపోతే స్నానాల కోసం పది నిమిషాల కరెంట్ కోసం బతిమిలాడేదని,రాత్రిళ్లు పొలాల వద్దకు వెళ్లిన రైతులను నక్సలైట్లు అనుకొని ఎన్‌కౌంటర్లు చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. హైవోల్టేజ్‌తో మోటార్లు కాలిపోయాయి ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. మానకొండూరు నియోజకవర్గానికి సాగునీరు అందించడానికి విద్యుత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, ఎంపీపీ వనిత, డీఈ తిరుపతి, ఏడీఈలు ప్రశాంత శ్రీనివాస్ ఏఈలు వెంకటరమణ, అహ్మద్, రమేశ్, అరవింద్, సంపత్, కుమార్ స్వామి వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పాల్గొన్నారు.

సంపద వనాల కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మానకొండూర్: పదివేల మొక్కల పెంపకమే ధ్యేయంగా, సంపద వనాల కోసం పదెకరాల స్థలాన్ని సోమవారం అదనపు డీఆర్‌డీవో సంధ్యారాణి ఎస్సారెస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని ముంజంపల్లి, ఈదులగట్టిపల్లి శివారులోని ఎస్సారెస్పీ స్థలాలను పరిశీలించి ఉపాధిహామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొక్కల పెంపకానికి స్థలాలను చదును చేయాలని, స్థలం చుట్టూ కందకం తవ్వించాలని సూచించారు. వివిధ రకాల మొక్కలను ఒకే చోట పెంచడం జరుగుతుందన్నారు. ఆమె వెంట ఏపీఎం శ్రీనివాస్, టీఏ మమత, ఎస్సారెస్పీ అధికారులున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ పరిధి సర్వే నంబర్ 146లో తమకు కేటాయించిన భూమిని కబ్జా కోరల నుంచి కాపాడాలని సోమవారం ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. 4.22 ఎకరాల స్థలాన్ని ఇళ్లు లేని ఎస్సీ నిరుపేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిందని, దీనిలో 20 గుంటలు పల్లె ప్రకృతి వనానికి కేటాయించగ మిగతా స్థలాన్ని అధికార పార్టీకి చెందిన నాయకులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రాజుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



బూజునూరులో ఉపాధ్యాయుల బడిబాట ర్యాలీ



రామడుగు: గుండి గ్రామంలో...

ఇల్లందకుంట: రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి తల్లిదండ్రులు వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని బూజునూరు, సిరిసేడు, సీతంపేట గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... మనఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా డిజిటల్ బోధన, లైబ్రరీ లో పుస్తకాలు, అధునాతన డెస్క్ సామగ్రి, ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తుందన్నారు. అనంతరం మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సదుపాయాలతో అన్ని హంగులతో ఈవిద్యా సంవత్సరం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరిగొమ్ముల అరుణ సదానందం, బూజునూర్ కాంప్లెక్స్ హెచ్ఎం పద్మ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు గోపి, ప్రణీతాదేవి, ఉపాధ్యాయులు వెంకటనర్సయ్య, ప్రవీణ్‌కుమార్, శంకర్, సుజాత, రవీంద్రనాయక్, శ్రీనివాస్, తిరుపతి,శ్రీధర్‌రెడ్డి, సీఆర్పీలు, శ్రుతకీర్తి, శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గుండి గ్రామంలో సోమవారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రచారం చేశారు. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా విద్యా బోధన అందిస్తున్నామని వివరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండి మానస, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, బీజేపీ నాయకులు పొన్నం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

'బీజేపీ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుంది'



మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతుందని, దేశ ప్రతిష్ఠను విశ్వవ్యాప్తం జేసిన మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడం విచారకరమన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు రూ.పదివేల పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని, అర్హులైన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. ఐదులక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, సంపత్‌రావు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల నిల్వపై అవగాహన

జమ్మికుంట: పట్టణంలోని కేవీకేలో వేర్ హౌజింగ్ డెవలప్‌మెంట్ రెగ్యులేటర్ యాక్టు, నెగోషియేబుల్ వేర్ హౌజ్ రిసిప్ట్ ఆధ్వర్యంలో పంట ఉత్పత్తుల నిల్వపై రైతులు, వ్యాపారులు, మిల్లర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఐపీహెచ్ఎం(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ మేనేజ్‌మెంట్) డైరెక్టర్ డాక్టర్ మరియదాస్, కెనారా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావులు మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకోవద్దని చెప్పారు. ధాన్యం పాడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గోదాముల్లో నిల్వ చేసుకున్న ధాన్యం, పప్పు దినుసులపై ఏవిధంగా బ్యాంకు ఋణం పొందవచ్చో తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు విజయ్, వేణుగోపాల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.